అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



3వ వార్డులో రోడ్డుపై పారుతున్న మురుగు

- కొండనాగులలో పడకేసిన పారిశుద్ధ్యం
- పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో పూడుకుపోయిన డ్రెయినేజీలు
- రోడ్లపై పారుతున్న మురుగు
- దోమల బెడదతో ప్రజల అవస్థలు
- పట్టింపు లేని గ్రామపంచాయతీ

బల్మూర్: మండలంలోని అతి పెద్ద గ్రామపంచాయతీ అయిన కొండనాగులలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో డ్రెయినేజీలు పూడుకుపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. అనేక చోట్ల మురుగు నిల్వ ఉంటుండటంతో దోమల బెడద నెలకొంది. సుమారు 8వేల మంది జనాభా గల కొండనాగులలో 16 వార్డులు, 2,016 నివాసగృహాలు ఉన్నాయి. ఆయా వార్డుల్లో డ్రెయినేజీలను రెండేళ్లుగా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో పూడుకుపోయాయి. గ్రామపంచాయతీలో 10 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.



8వ వార్డులోని డ్రెయినేజీలో పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రతినెలా డ్రెయినేజీలను శుభ్రం చేయాల్సి ఉండగా.. గ్రామపంచాయతీ నిర్లక్ష్యంతో పారిశుద్ధ్యం పడకేసింది. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటంతో దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు వీధుల్లో పారుతుండటంతో పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

మురుగు కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి..



గ్రామంలో రెండేళ్ల నుంచి డ్రెయినేజీలను శుభ్రం చేయడంలేదు. దీంతో పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు చెత్తతో నిండిపోయాయి. మా వార్డులో డ్రెయినేజీ పూర్తిగా పూడుకుపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పెడచెవిన పెడుతున్నారు.

– రాజు,
8వ వార్డు, కొండనాగుల

పారిశుద్ధ్య చర్యలు చేపడతాం..

నేను 6 నెలల కిందట కొండనాగులకు వచ్చినప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయించాను. పెద్ద గ్రామం కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక నుంచి డ్రెయినేజీలను శుభ్రం చేయించడంతో పాటు పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపడతాం.

– చందు,
పంచాయతీ కార్యదర్శి, కొండనాగుల

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వర్‌రెడ్డి, శేఖర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

తెలకపల్లి: రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని ఎంపీటీసీ రెడ్డపాకుల రమేష్ అన్నారు. తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం బోయ రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. మండల కేంద్రానికి చెందిన 23 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడిన వారికి సకాలంలో రక్తం లభించక ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకురావాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన రాజును అభినందించారు. సేకరించిన రక్తాన్ని నాగర్‌కర్నూల్ బ్లడ్‌బ్యాంక్‌కు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాము, రమేష్, లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం గ్రామస్తులు ప్రారంభించారు. గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు రాంచందర్, శివ, భాస్కర్, అశోక్, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

పాలమూరు న్యాయ యాత్రకు స్పందన



కల్వకుర్తిరూరల్: పాలమూరు న్యాయ యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపేట నియోజకవర్గం ధన్వాడ మండలంలో ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని వంశీచంద్‌రెడ్డి ఇస్తున్న హామీకి ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్రలో స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నానియాదవ్ పాల్గొన్నారు.
చారకొండ: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్రలో చారకొండ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వంశీచంద్‌రెడ్డితో పాటు నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పాలాది బాల్‌రాజు, మాజీ సర్పంచులు భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, నాయకులు కొండల్, శేఖర్, మోతీలాల్, పుల్లయ్య, పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సామగ్రి వితరణ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.5 లక్షల విలువగల మెటీరియల్ వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

శివశంకర్‌కు అవార్డు



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన బీఎస్పీ మండల అధ్యక్షుడు రెడ్డపాకుల శివశంకర్ జిల్లా ఉత్తమ వర్కర్ అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ కేంద్ర సమన్వయకర్త, ఎంపీ రాంజీగౌతం, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా ఉత్తమ బీఎస్పీ వర్కర్‌గా అవార్డు అందుకున్నట్లు శివశంకర్ తెలిపారు. ఈసందర్భంగా నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఇన్‌చార్జ్‌లు అంతటి నాగన్న, యూసూఫ్, బండి పృథ్వీరాజ్‌లు హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తల సహకారంతోనే తనకు ఈ అవార్డు దక్కిందని శివశంకర్ తెలిపారు.

సెల్‌నంబర్ లింక్ చేసుకోవాలి

పెంట్లవెల్లి: విద్యుత్ మీటర్‌కు వినియోగదారులు తమ మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని ఏఈ విజ్ఞాన్ ఆదివారం ప్రకటనలో కోరారు. మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లు మెసేజ్ రూపంలో రావడంతో పాటు సరఫరాలో అంతరాయం ఉంటే సమాచారం అందుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

కందనూలు: జిల్లా కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.బాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా రాత్లావత్ రాముడునాయక్, కోశాధికారిగా మేఘావత్ జాన్యానాయక్, గౌరవాధ్యక్షులుగా దాసునాయక్, రాత్లావత్ కిషన్‌నాయక్, ఉపాధ్యక్షులుగా ఆర్.చిన్నికృష్ణ, శ్రీను, వాళ్లందరి నాయక్, రాజేష్‌నాయక్, సలహాదారులుగా రాంజీ నాయక్, సీతారాంనాయక్, లక్ష్మణ్‌నాయక్, రెడ్డిరాంనాయక్, సూర్యం, బిచ్చానాయక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈనెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మగ్దూం మోహియొద్దీన్ జయంతి



మగ్దూం మోహియొద్దీన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కందనూలు: స్టేట్ టీచర్స్ యూనియన్ ఫౌండర్ మగ్దూం మోహియొద్దీన్ జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టీయూ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి మాట్లాడుతూ.. మగ్దూం మోహియొద్దీన్ ఆశయాల సాధనతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి, రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్, నాగర్‌కర్నూల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మధుసూదన్‌రెడ్డి, కె.సురేష్‌బాబు, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు మద్దిలేటి, బిజినేపల్లి మండల అధ్యక్షుడు బాలస్వామి, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఆహ్వానం



కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న ఖాజాబందే నవాజ్ ఉత్సవాలకు హాజరుకావాలని కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథికి ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆహ్వానపత్రం అందించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కల్వకుర్తి నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన మాధవరెడ్డితో పాటు రెండవ ఎస్ఐ రాజును కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించి, ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఆంజనేయులు, రమేష్‌గౌడ్, యాదిరెడ్డి, జగదీశ్వర్, హసన్ పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు సన్మానం

కల్వకుర్తిరూరల్/కోడేరు: కల్వకుర్తి ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మాధవరెడ్డిని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గణేష్, కిషోర్, రామకృష్ణ, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా కోడేరు ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన కురుమూర్తిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌రావు, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ కరీం, సురేందర్‌రెడ్డి, కొమ్ము దానయ్య, శరత్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.



కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముమ్మరంగా 167కే హైవే పనులు



తాడూరు: 167కే జాతీయ రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కల్వకుర్తి, తాడూరు, కొల్లాపూర్ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల వరకు చేపట్టిన హైవే పనులు రోజురోజుకూ వేగం పుంజుకుంటున్నాయి. తాడూరు మండల కేంద్రంలో బైపాస్ ఏర్పాటు చేసేందుకు భూసేకరణ పూర్తి చేశారని, త్వరలోనే బైపాస్ పనులు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

రేపటి నుంచే పాన్‌గల్ ఈదమ్మ జాతర



ఉత్సవాలకు ముస్తాబైన ఈదమ్మ గుడి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఈదమ్మ దేవత జాతర మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పూజారి నాగన్న తెలిపారు. అమ్మవారి జాతర రెండు రోజుల పాటు జరుగుతుందని, మొదటి రోజు షిడి, రెండో రోజు పోలారం బండ్లు, బోనాలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. జాతర వేడుకలకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి గుడి పరిసరాల్లో మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. ఈదమ్మ ఉత్సవాల కోసం గుడిని ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ దళితులను నిరాశ నిస్పృహలకు గురిచేసిందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుపై ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో దళితుల సమగ్ర అభివృద్ధిపై స్పష్టత లేదన్నారు. అంకెల్లో పెరుగుదల.. ఖర్చులో తరుగుదలగా బడ్జెట్ ఉందని విమర్శించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద నామమాత్రపు నిధులు కేటాయించారన్నారు. గతంలో కేటాయించిన బడ్జెట్‌లో 40 శాతం నిధులు ఖర్చు చేయకుండానే మురగబెట్టారని తెలిపారు. దళితుల ప్రత్యేక ప్రయోజనాల కోసం సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయాలని డిమాండ్‌చేశారు. 2015 నుంచి 2023 వరకు 2,50,084 పక్కా గృహాలు తెలంగాణకు మంజూరు కాగా.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేవలం 1,23,933 ఇళ్లు మాత్రమే పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ సారి బడ్జెట్‌లో 2కోట్ల ఇళ్ల నిర్మాణం చేపడతామని ప్రగల్భాలు పలుకుతూ.. సామాజిక న్యాయాన్ని సమాధి చేసేవిధంగా రిజర్వేషన్లు రద్దుచేసే ఆలోచన చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాగపూర్ మధు, శివరాం, నర్సింహ, మల్లేష్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తంచేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వనపర్తి, గద్వాల, పెబ్బేరు, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కలశాలు అందజేత

మహాసముద్రం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సుగుణమ్మ కుమారుడు వెంకటేష్‌గౌడ్ నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి మూడు కలశాలు అందజేశారు. ముందుగా తన భార్య పద్మతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, సిబ్బంది మారుతిరావు, డైరెక్టర్లు అశోక్‌రెడ్డి, రాముడు, నర్సింహ పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న మైసమ్మ ఆలయం

రైతులకు డబ్బుల చెల్లింపులో జాప్యం



మార్కెట్‌లో పల్లీ తూకాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కల్వకుర్తిరూరల్: వ్యవసాయ మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన వేరుశనగకు డబ్బుల చెల్లింపులో జాప్యం చేయడం తగదని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌ను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విషయాన్ని మార్కెట్ కార్యదర్శి భగవంతు దృష్టికి తీసుకెళ్లగా.. తనకేమీ తెలియదని చెప్పడం సరికాదన్నారు. మార్కెట్‌లో పంటలను అమ్మేందుకు వచ్చే రైతులకు అన్ని వసతులు కల్పించడంతో పాటు సకాలంలో పంట డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పెద్దయ్యయాదవ్, రాములుయాదవ్, రైతులు బాలస్వామి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష

లింగాల: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం ఇంటర్ ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 456 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 12 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. బాలికలు 326 మందికిగాను 9మంది, బాలురు 130 మందికిగాను ముగ్గురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు, వారి వెంట వచ్చిన వారితో మండల కేంద్రం సందడిగా మారింది.
మన్ననూర్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో 395 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తం 408మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 13 మంది గైర్హాజరైనట్లు డిపార్టుమెంటల్ అధికారిణి కవిత తెలిపారు.
వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించిన సీఓఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 264మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 250 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ షకీలా సుల్తానా తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డిపార్టుమెంటల్ ఆఫీసర్ ఎస్.కృష్ణ, షకీలా సుల్తానా పర్యవేక్షించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.
కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో 282 మంది విద్యార్థులు సీఓఈ ప్రవేశ పరీక్ష రాశారు. మొత్తం 288 మందికిగాను ఆరుగురు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ప్రిన్సిపాల్ జ్యోత్స్న పర్యవేక్షించారు.



కొల్లాపూర్‌లో సీఓఈ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



లింగాలలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు



వెల్దండలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మల్లురవికి ఎంపీ టికెట్ కేటాయించాలి

కొల్లాపూర్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లురవికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాని స్థానిక నాయకులు కోరారు. పట్టణంలోని కేఎల్‌ఐ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు రంగినేని జగదీశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు కష్టకాలంలో ఉన్నప్పుడు మల్లురవి అండగా నిలిచారని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషిచేశారన్నారు. పార్లమెంట్ టికెట్ మల్లురవికి కేటాయిస్తే.. ఆయన సునాయసంగా గెలుస్తారన్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మల్లురవికి పార్టీ శ్రేణులతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో శివన్న, పరశురాంనాయుడు, కాంతారావు, శంకర్, నడిమింటి వెంకటస్వామి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు